# ప్రయాణం

శ్రీశ్రీ



అందుకే చెట్టంటే ఎంతో నాకిష్టం; ఎక్కడికీ చెట్టు ఎప్పుడూ వెళ్ళదు కాబట్టి.

ఇవాళ ఉదయం ట్రాముకోసం తపస్సు చేస్తూ చెట్టుకింద నిలబడ్డాను. "ఎక్కడికి నేస్తం" అని చెట్టు నన్నడిగినట్టనిపించింది. ఇంకెవరైనా నా ప్రశ్న అడిగితే "మైలాపూరు" అని జవాబిచ్చేవాణ్ణి. నిజాన్ని మనం కొలిచే పొడుగు వెడల్పులవంటి మితులతో నా జవాబు నిజంలాగే కనబడేది. కాని చెట్టువేసింది మన్న ప్రశ్న కాబట్టి "మైలాపూరు నా గమ్యం" అని ఏ మొగం పెట్టుకొని జవాబివ్వగలను? "తెల్లారగట్టే లేచి ఇందుకా ఈ వానలో నిలబడ్డావు?" అని చెట్టు గద్దిస్తే ఏమయిపోవాలి నేను?

చెట్టుతో ఎవరూ మాట్లాడలేరు. మనం ఎంత కొలిచికొలిచి జవాబు చెప్పినా అది అబద్ధపు వాసనే కొడుతుంది. చెట్టుని ఎవ్వరూ కొలవలేరు. మన ఆస్తుల్ని కొలుచుకోగలం! ఏదో ఒక [illegible] పేరు చెప్పి ఎవరో ఒక దేవుణ్ణి కొలుచుకోగలం. కాని, ప్రపంచ పర్యాప్తమైన చెట్టు తాలూకు ఆకుపచ్చని అహింసాత్మక సామ్రాజ్యపు వైశాల్యాన్ని ఎవ్వరూ కొలవలేరు. ఇంతలో ట్రాంబండి వచ్చింది. నాకు నిలబడ్డానికి చోటు దొరికింది. నిలుచున్న పాటుగా నేనేమీ కదలకుండానే ఒక చోటునుండి ఇంకో చోటు చేరుకున్నాను. నిలుచున్నంతసేపూ నా ఆలోచనలన్నీ చెట్టును గురించే! చెట్టులో నువ్వుచూసే నిశ్చలత్వం నిలకడి కాదు. శవానిది కాదు. అది కదలదనుకోవడం భ్రమ. క్షణం క్షణం చెట్టు కదుల్తూనే ఉంటుంది. అయితే దాని ప్రయాణం ఔన్నత్యంవేపు. ఆకాశాన్ని అందుకోవాలని ప్రతీచెట్టూ ప్రతీక్షణం ప్రయత్నిస్తూనే ఉంటుంది.

ధ్వనికన్నా ఎక్కువవేగంతో ప్రయాణంచేసే విమానం ధన్యమైనదే. కాని శ్రావణమంగళవారపు నోమురోజున సెనగగింజలోనుండి ఎగిసే మొక్క సాధించే వేగానికి నేను ఆశ్చర్యం పొందకమానలేను. చిన్నప్పుడు నేను పారేసిన చింతపిక్కల సంతానం ఇప్పుడు సకల ప్రపంచాన్ని నిండిపోయిందన్న తలంపు కేవలం నిరాధారమైనది కాదు. శ్మశానాలమీద వానకురిసినప్పుడు ఎంత వేగంగా పచ్చగడ్డి ఎదుగుతుందో ఎందుకు నేను వేరే చెప్పడం?

నీ, నీ ఒక్కొక్క ఊహకి ఉదాహరణంగా ఒక్కొక్క చెట్టుని చూడగలవు.

"గోరికెల్ల ధనాశిబడ గోల్పడి,
దిక్కులకూన్యపృక్కులంజేరి
యేటో వృధా శిశిరజీవన భారము
మోచుచున్న భూమీరుహమేను..."

అన్నాడో కవి.

"శ్రీమదఖండ సౌభాగ్యమున్ వినిలన్
నేమంతి నీమంతినున్
హేమంతుడను కాంతరాక్షకుర కాం
తే వింతమీరంగ వని
భూమిన్ మేన నలంకరించుకొను గా
పుల్, సీలముల్, వజ్రముల్
గోమేధంబులు నాటెలంగ నొడు గా
నుక్ గల్గు పుష్పావళుల్||"

అన్నాడు ఇంకో కవి.

ఇక్కడ నా ఉద్దేశంలో కొమ్మా, రెమ్మా, మొగ్గా, ముల్లూ, ఆకూ, వేరూ అన్నీ చెట్టే!

అందుకే చెట్టంటే ఎంతో నాకిష్టం. ఎక్కడికీ చెట్టు ఎప్పుడూ వెళ్లకపోతేనేం? ఏరోప్లేనులో ఎక్కినా ఎక్కడికి వెళ్లగలం మనం? ఎక్కడికీ వెళ్లని చెట్టు ఎప్పుడూ మనతోనే, మనలోనే ఉంది. ఇందుకే నాకంటే చెట్టంటే ఇష్టం.